

విద్యార్థులకు ప్రశంసలు

ప్రజాశక్తి-నెల్లూరు: ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్, పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన జిల్లా లోని ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ విద్యార్థిని విద్యార్థులకు కలెక్టర్ ఒ. ఆనంద్ మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. ఇంటర్మీడియేట్ సెకండ్ ఇయర్ ఎంపిసి పరీక్షల్లో 961 మార్కులు సాధించిన నెల్లూరు సాంఘిక సంక్షేమ శాఖ కేంద్ర ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులు యారద సంగీత, సి ఇ సి లో 927 మార్కులు సాధించిన బిట్రగుంట మేఘన, పదవ తరగతిలో 574 మార్కులు సాధించిన వింజమూరు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఏ. నందిని, 568 మార్కులు సాధించిన ఉలవపాడు సాంఘిక సంక్షేమ బాలికల హాస్టల్ విద్యార్థిని ఎస్. కాజోల్ లక్ష్మి అగర్వాల్, 565 మార్కులు సాధించిన ఆత్మకూరు సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్ విద్యార్థి పెన్నా రోజెక్ట్ సాయి ధనుష్ తదితరులకు కలెక్టర్ తమ ఛాంబర్ లో ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఇదే ఒరవడి కొనసాగించి భవిష్యత్తులో మంచి చదువులు చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ వారికి ఆశీస్సులు అందజేశారు.

విద్యార్థులతో కలెక్టర్ ఆనంద్

'ఉపాధి'కి ఎండ దెబ్బ..!

◆ఏడేళ్ల నుంచి సమ్మర్ అలవెన్స్ రద్దు
◆భారీగా కూలీల బకాయిలు

ఉపాధి హామీ పథకానికి ఎండ దెబ్బ తగులుతోంది.. మార్చి నుంచే తీవ్రమైన ఉష్ణోగ్రతలు రావడంతో బయట తిరగాలంటేనే జనం భయపడిపోతున్నారు.. ప్రభుత్వం ఉదయం 5.30 నుంచి 10 గంటల వరకు మాత్రమే పనులు జరుగుతున్నాయి. గతంలో ఉపాధి కూలీల పరిస్థితులు అర్థం చేసుకొని ప్రభుత్వం సమ్మర్ అలవెన్స్ ఇచ్చేది. ఇందులో పనిచేసేచోట టెంట్లు, మజ్జిగ, మంచినీరు వంటి సదుపాయాలు కల్పించేవారు. ఏడేళ్ల నుంచి దీనిని తొలగించినట్లు తెలుస్తోంది. ప్రాథమిక చికిత్స కిట్స్ ఎక్కడ పనిచేయడం లేదు. జిల్లాలో కూలీలకు కూలీలు ఉన్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసినా కూలీలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారనే తెలుస్తోంది....

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

పేద కూలీలకు వంద రోజులు పనిదినాలు కల్పించి, కుటుంబ ఆర్థిక వెసులుబాటు కల్పించడానికి ఏర్పాటు చేసిన ఉపాధి హామీ చట్టాన్ని నీరుకార్చేలా ప్రస్తుత ప్రభుత్వ తీరు కనిపిస్తోంది. ఒకప్పుడు ఎంతో ఉత్తేజంగా, కనిపించిన ఈ పథకం నీరుగారిపోతున్నట్లు ఉంది. జిల్లా వ్యాపితంగా ప్రస్తుతం 4.18 లక్షల మంది ప్రజలు ఉపాధి కింద నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం 75 వేల మంది మాత్రమే ఉపాధి పనిచేస్తున్నారు. ఇటీవల వరకు రోజు కూలీ రూ.300 ఉండగా, ప్రస్తుతం దానిని రూ.305కి పెంచారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు ఉండేవి. వరినాట్లు, కలుపు, కుప్పనూర్పుడు వంటి పనులుండేవి. మట్టి పనులు ఎక్కువగా ఉండేవి. ఇందులో కూలీ పనుల పేరుల చేసుకునేవారు. ఇటీవల కాలంలో వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ భారీగా పెరిగిపోయింది. వరి యంత్రాలు అన్ని విభాగాల్లో వచ్చాయి. మట్టి పనులకు జెసిబి, ప్రొక్లెయిన్లు అందుబాటులోకి వచ్చాయి. మనుషుల కన్నా యంత్రాలతోనే వేగంగా, తక్కువగా ఖర్చు అవుతుండడంతో ఎక్కువ మంది యంత్రాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో కూలీలకు పనులు ఉండడం లేదు. ఉపాధి కూలీ పనులు వచ్చాక కొంత ఉపశమనం కలిపిస్తోంది. ఉపాధికి పెద్ద ఎత్తున బకాయిలు పేరుకుపోయినట్లు తెలిసింది. రాష్ట్రానికి రూ.1300 కోట్లు ఇటీవల విడుదల చేశారు. ఇందులో జిల్లాకు రూ.40 కోట్లు నిధులొచ్చినట్లు సమాచారం.

'ఉపాధి'కి ఎండ దెబ్బ..!

ఉపాధి హామీ పథకం అమలు చేయడంలో కొంత నిర్లక్ష్యం కనిపిస్తోంది. యంత్రాలతో కాకుండా ఎక్కువ శాతం మనుషులతోనే పనులు చేయించాలని ఆదేశాలున్నాయి. చెరువులు, రోడ్లు, స్కూళ్ల ఇలా ప్రజల అవసరాలకు ఉపయోగపడే పనులు ఉపాధి కింద చేపడుతున్నారు. ఒకప్పుడు ఉపాధి కూలీల పనులు చేసే క్రమంలో ఎండ తీవ్రత తట్టుకోడానికి సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారు. దీంతో పనిచేసే చోట మజ్జిగ, టెంట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచినీరు వంటి సౌకర్యాలు కూలీలకు కల్పించేవారు. ప్రభుత్వం ఏడేళ్ల క్రితం దీనిని పక్కన పడేసింది. ఉదయం 5.30 గంటల నుంచి ఉదయం 10 గంటల్లోపు పనులు చేసుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో పనులు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కొంత కూలీల తగ్గుముఖం పట్టారనే తెలుస్తోంది. కనీసం మంచినీరు అందుబాటులో ఉండడం లేదు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఉపాధి పథకం నీరుగారి పోయేలా ప్రభుత్వం వ్యవహరిస్తుంది. ఎంతో బాగా జరుగుతున్న ఉపాధి పనుల్లో కూలీల ప్రాత తగ్గించేలా ప్రభుత్వ చర్యలున్నాయనే ఆరోపణలున్నాయి. దీంతో యంత్రాలతో పనులు చేయించి, ఆ నిధులు కాంట్రాక్టర్లకు కట్టబెట్టేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కూలీల జీవన భృతి కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం ఇలానే కొనసాగితే కాంట్రాక్టర్ల పాలు కావడం ఖచ్చితంగా కనిపిస్తున్నాయి..

వరికుంటపాడులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

కూలీలకు బకాయిలు..!

ఉపాధి కూలీలకు ప్రభుత్వం బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇటీవల రూ.1300 కోట్లు రాష్ట్రానికి విడుదలయ్యాయి. అందులో రూ.40 కోట్లు జిల్లాకు వచ్చినట్లు తెలుస్తోంది. కూలీలకు పూర్తి స్థాయిలో కూలీలు అందలేదని తెలుస్తోంది. అధికారులు మొత్తం ఇచ్చామని చెబుతున్నా కింద స్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. వరికుంటపాడు మండలంలోని కొన్ని గ్రామాల్లో వారికి రూ.900 నుంచి రూ.1200 వరకు అందాయి. వారానికి రూ.1800 అందాల్సి ఉండగా, పెండింగ్‌లోఉన్నట్లు సమాచారం. జనవరి 14 నుంచి ఉపాధి కూలీలు పెండింగ్‌లో ఉన్నట్లు స్థానిక కూలీలు చెబుతున్నారు. కొందరికి కొంత ఇచ్చి చేతులు దులుపుకున్నారనే తెలుస్తోంది. ఈ క్రమంలో కాంట్రాక్టర్ల బిల్లుకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తమకు పూర్తిలో బకాయిలు ఇవ్వాలని స్థానికంగా ఉండే కూలీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

దాడులు మానవత్వానికే కళంకం

ప్రజాశక్తి-కందుకూరు: కాశ్మీర్ అందాలను తిలకించేందుకు కాశ్మీర్ లోయకు వెళ్లిన టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన దాడి మానవత్వానికి కళంకమని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి. సురేష్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కుటుంబాలతో ఉల్లాసంగా ఉత్సాహంగా కాశ్మీర్ కు వెళ్లిన టూరిస్టులపై ఉగ్రవాదులు ఒక్కసారిగా విరుచుకుపడి హత్య చేయడం బాధాకర అంశమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి సిపిఐ నివాళులు అందిస్తుందన్నారు. సమావేశంలో సిపిఐ నాయకులు యర్రంశెట్టి ఆనందమోహన్, బాల బ్రహ్మాచారి, ఉప్పుటూరు మాధవరావు, ఎం. రామయ్య పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు

జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన భారతీయులలో కావలికి చెందిన మధుసూదన్ కుటుంబ సభ్యులకు అదే ఉగ్ర దాడిలో మరణించిన ఇతర భారతీయుల కుటుంబ సభ్యులకు ఏ పి ఎన్ జి జి ఓస్ అసోసియేషన్ జిల్లా పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. అనంతరం కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు ,జిల్లా కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక సలహాదారుడిని కలిసిన కమిషనర్

ప్రజాశక్తి-నెల్లూరు: మాజీ డిఆర్‌డిఒ చైర్మన్, ఏపి ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడు డాక్టరు జి.సతీష్‌రెడ్డిని, కలెక్టర్ ఒ ఆనంద్‌ను, జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను కార్పొరేషన్ కమిషనర్ వై.ఓ. నందన్ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక టెక్కేమిట్ట ప్రాంతంలో మాజీ డిఆర్‌డిఒ చైర్మన్, ఏపి ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడు డాక్టరు జి.సతీష్‌రెడ్డి స్వగృహంలో కలిశారు. జిల్లా అధికారులను వారి వారి కార్యాలయాల్లో కలిశారు.

నినాదాలు చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

పెన్షన్ హయ్యర్ ఆప్షన్ తిరస్కరణ దారుణం

ప్రజాశక్తి-నెల్లూరు

కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించి 7లక్షల 52 వేల మంది పెన్షన్ హయ్యర్ ఆప్షన్ దరఖాస్తులను తిరస్కరిం చిందని, ఈ చర్య అత్యంత దారుణమైనదని ఎస్‌డబ్ల్యూఎఫ్, ఏఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చర్యలను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఈపిఎస్ రీజినల్ కేంద్రాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని పెన్షన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులు నంద్యాల రాజశేఖర్‌లు మాట్లాడుతూ గడిచిన కొన్ని సంవత్సరాల నుంచి హయ్యర్ పెన్షన్ సమస్యపై ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆందోళన కార్యక్రమాలు, పోరాటాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలపై మిగిలిన సంఘాలు పెద్దగా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆర్‌టిసి రిటైర్డు ఉద్యోగులకు కనీస పెన్షన్ రూ.9 వేలు అందజేయాలని డిఎ పెరిగిన సమయంలో పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు. 1995 నుంచి 2014 వరకు హైయర్ ఆప్షన్ కట్టిన ఉమ్మడి రాష్ట్ర ఆర్‌టిసి ఉద్యోగులు 16,307 మందికి హయ్యర్ పెన్షన్ రిజెక్టు చేశారన్నారు. అయితే ఇంత వరకు వారు చెల్లించిన సొమ్మును తిరిగి చెల్లించకపోవడం దారుణమన్నారు. అనేక కారణాలతో గతంలో హైయర్ పెన్షన్ డిమాండ్ నోటీసు వచ్చినప్పటికి చెల్లించలేని వారికి ప్రభుత్వం మరో మారు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం పెన్షన్ కార్యాలయ అధికారి ఇన్‌ఛార్జి కమిషనర్ వి.సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఈ.శివకుమార్, రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి.చంద్రమౌళి, రిటైర్డు ఉద్యోగుల రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వి.పి నరసింహారెడ్డి, పలువురు కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నగరంలో ప్రేమజంట ఆత్మహత్య

ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలోని సింహపురి హోటల్‌లో ప్రేమజంట ఆత్మహ్యాతకు పాల్పడింది. ఈ ప్రేమ జంట నాలుగు రోజుల క్రితం గదిని అద్దెకు తీసు కున్నట్లు సమాచారం. శుక్రవారం హోటల్ గది నుంచి దుర్గంధ భరితమైన , దుర్వాసనలు వెదజల్లడంతో హోటల్ సిబ్బంది పరిశీలిం చడంతో అసలు వ్యవహారం బహిర్గతమైంది. హోటల్ యాజమాన్యం స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందజేయడంతో సంతపేట పోలీసు స్టేషన్ సిఐ దశరదరా మారావు హుటాహుటిన పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. హోటల్ గది తలుపులు పగులగొట్టి చూడగా రెండు మృత దేహాలు రక్తపు మడుగులో కుళ్లిపోయి ఉన్నాయి. ఈ మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కి తరలించి కేసు నమోదు చేసుకున్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజల సహకారంతో మలేరియా నివారణ

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజల సహకారంతో మలేరియా రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి.సుజాత అన్నారు.శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సంతపేట నుంచి గుప్తా పార్కు వరకు చేపట్టిన ఈ ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టరు వి. సుజాత నేతృత్వంలో నిర్వహించారు.అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "మలేరియా అంతం మనతోనే సాధ్యం" అనే నినాదంతో ప్రజలందరూ చురుగ్గా సహకరించాలని పిలుపు నిచ్చారు. మలేరియా వ్యాధి ఎనాఫిలిస్ ఆడ దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుందని, దానివల్ల చలి, వాంతులు, వణుకు, తీవ్రమైన జ్వర లక్షణాలు ఉత్పన్నమవుతాయన్నారు. దోమ కాటుకు 8 నుండి 12 రోజుల్లో లక్షణాలు బయటపడతాయని, అలాంటి సమయంలో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలని సూచించారు.మలేరియా నివారణ, నియంత్రణ నిర్మూలన కోసం ప్రభుత్వ ఆరోగ్యశాఖ నిబద్ధతతో పనిచేస్తోందని, ప్రజలు సహకరిస్తే 2030 నాటికి దేశంలో మలేరియాను పూర్తిగా నిర్మూలించవచ్చన్నారు. అనంతరం జిల్లా మలేరియా అధికారిణి ఇ. హుస్సేనమ్మ మాట్లాడుతూ, "మలేరియా నిర్మూలన మన చేతిలోనే ఉందన్నారు. ప్రజల్లో మార్పు రావాలని,మనకు ఉన్న వనరులతో, ఉత్తేజంతో ముందుకు సాగాలి" అని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఎ. డి. ఎం. హెచ్. ఓ. షేక్ ఖాదర్ వలీ, పి.ఎల్. దయాకర్, డెమో కె. కనకరత్నం, అసిస్టెంట్ మలేరియా అధికారి వి. నాగార్జునరావు, జిల్లా పిఎంపి నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, దేవరకొండ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాను నివారించొచ్చు
-మెడికవర్ వైద్యులు సూచన

దోమల ద్వారా వ్యాపించే అంటు వ్యాధి మలేరియా అని, అది సోకితే అప్రమత్తంగా ఉండాలని, లేదంటే కొన్ని సందర్భాల్లో మరణానికి కూడా కారణమవుతుందని నెల్లూరు మెడికవర్ హాస్పిటల్ కన్సల్టెంట్ ఫిజీషియన్ అండ్ డయాబెటాలజిస్ట్ డాక్టర్లు పెంచల ప్రసాద్, రవీంద్ర రెడ్డి, విజయకుమార్ హెచ్చరించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మెడికవర్ హాస్పిటల్ జరిగిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా వ్యాధి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏటా 6లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. సరైన జాగ్రత్తలు తీసుకొని కారణంగా ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు మలేరియా బారిన పడుతున్నారని వెల్లడించారు. మలేరియా వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ప్రతేడాది ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు డాక్టర్ పెంచల ప్రసాద్, డాక్టర్ రవీంద్ర రెడ్డి, డాక్టర్ విజయకుమార్ వెల్లడించారు. అనుభవజ్ఞులైన వైద్య బృందం అందుబాటులో ఉందని, మెడికవర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, ఫిజీషియన్ విభాగం వైద్యులు, సిబ్బంది, పిఆర్వో చందు వర్మ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులోకి పార్కులు

ప్రజాశక్తి-నెల్లూరు

పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు పి. నారాయణ ఆలోచనల మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో జిమ్ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ శుక్రవారం 4, 5, 9వ డివిజన్లు జాకీర్ హుస్సేన్ నగర్, రేబాల వారి వీధి పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డివిజన్ల పరిధిలో పార్కులను అభివృద్ధి చేసి పార్కులలో అవసరమైన ఆట వస్తువులు, క్రీడా పరికరాలు, వ్యాయామ సౌకర్యాలను, పాదచారుల ట్రాక్, పచ్చదనం, పెయింటింగ్, బెంచీలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్కులను అభివృద్ధి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తేనున్నామని వెల్లడించారు.అన్ని డివిజన్లలో ప్రధాన డ్రెయిను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో డ్రెయిను కాలువల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. నగరవ్యాప్తంగా ప్రణాళికాబద్ధమైన పారిశుధ్య నిర్వహణకు, దోమల నిర్మూలనకు ప్రతిష్టాత్మక చేపట్టిన భూగర్భ డ్రెయిను వ్యవస్థలో అన్ని గృహాలను అనుసంధానం చేసి, పరిశుభ్రమైన నగరంలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ తమ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు, తగిన రక్షణ చర్యలను తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఈ.ఈ. రహంతు జానీ, డి.ఈ.ఈ. రఘురాం అధికారులు, ప్రజా ప్రతినిధులు,సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

పరిశ్రమలకు శుద్ధి కేంద్రాల నీటి వినియోగానికి ప్రణాళికలు

ప్రజాశక్తి-నెల్లూరు: నగరపాలక సంస్థ పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుభ్రమైన నీటిని స్థానిక పరిశ్రమలకు సరఫరా చేసి పారిశ్రామిక అవసరాలకు వినియోగించేలా ప్రణాళికలు యోచిస్తున్నామని కమిషనర్ వై ఓ నందన్ ప్రకటించారు. కృష్ణపట్నం పోర్టు పరిసర పరిశ్రమల ప్రతినిధులు, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశాన్ని కార్యాలయంలోని కమిషనర్ చాంబర్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని మూడు ప్రధాన మురుగునీటి శుద్ధి కేంద్రాల ద్వారా శుద్ధి చేయబడిన నీటిని వ్యవసాయ అవసరాలతో పాటు పారిశ్రామిక అవసరాలకు వినియోగించవచ్చని తెలిపారు. పెద్ద సంఖ్యలో పరిశ్రమలు ఉన్న కృష్ణపట్నం పోర్టు ప్రాంతానికి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించామని అధికారులను కమిషనర్ ఆదేశించారు. మురుగునీటి శుద్ధి కేంద్రాల నీటి పునర్వినియోగానికి సంబంధించిన ప్రతిపాదనలను పూర్తిగా సిద్ధం చేసి రాష్ట్రపట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు పి. నారాయణ, కలెక్టర్ ఓ ఆనంద్ లకు నివేదించాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఇంజినీరింగ్ విభాగం ఎస్ఇ రామ్ మోహన్ రావు, డిఇఇ లు సుధేష్ణ, రఘురాం, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్

పొగాకు వేలం కేంద్రంలో పరిశీలిస్తున్న అధికారి

పొగాకు వేలం కేంద్రంలో సందర్శన

ప్రజాశక్తి-కందుకూరు

పొగాకు బోర్డు సెక్రటరీ దివి వేణుగోపాల్, తేలిక నేలల ప్రాంతీయ అధికారి శ్రీలక్ష్మణ్ రావులతో కలిసి కందుకూరులోని రెండు వేలం కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు వేలం జరిగే విధానాన్ని పరిశీలించి బయ్యర్లు రైతులకు మంచి ధరలు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా రైతులను ఉద్దేశిస్తూ వారు ప్రస్తుత మార్కెట్ ను దృష్టిలో ఉంచుకుని వేలం లో వెళ్లే బేల్స్ మాత్రమే తీసుకు రావాలని కోరారు. వారు అంతర్జాతీయ స్థాయిలో ఉన్న పొగాకు ఉత్పత్తిని వివరించారు.పొగాకు బోర్డు ఎప్పుడూ రైతుల మంచి కోసమే పని చేస్తుందని తెలిపారు. వేలం కేంద్రాలకు వచ్చే ముందు ఒకసారి తమ పొగాకు బేళ్లను సరి చూసుకోవాలని తేమ, వేడి, షాఫ్ట్ లేకుండా చూడాలన్నారు. రైతు సోదరులు కచ్చితంగా గ్రేడింగ్ చేయాలని కోరారు. గ్రేడింగ్ సరిగా చేయక పోతే మార్కెట్ జరపడం కష్టమని చెప్పారు. ఆ తరువాత కంపెనీ ప్రతినిధులతో మీటింగ్ నిర్వహించి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని నో బిడ్ లు తగ్గేలా చూడాలని సూచించారు.తదనంతరం పొగాకు బోర్డు సిబ్బందితో సమావేశం నిర్వహించి వేలం సజావుగా సాగడానికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు, రైతులు బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతి అందజేస్తున్న ఆవాజ్ నాయకులు

ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో జువేరియాకు చిరు సన్మానం

ప్రజాశక్తి-నెల్లూరు

పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి జిల్లా పేరు ప్రతిష్టను రాష్ట్ర స్థాయిలో చాటిన మొహమ్మద్ జువేరియాను ఆవాజ్ జిల్లా కమిటీ బృందం చిరు సన్మానం చేసింది. శుక్రవారం ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లిన ఆవాజ్ జిల్లా కమిటీ పదిలో అత్యంత ప్రతిభను చాటినందుకు అభినందించి. జెడ్‌పిపి నవలాకుల గార్డెన్స్ హైస్కూల్, (నెల్లూరు రూరల్ లో) నందు చదువుతూ ఆ విద్యార్థిని 10వ తరగతి లో 600/594 మార్కులు సాధించి జిల్లా లోనే 3వ స్థానం కైవసం చేసుకుంది. మొహమ్మద్ జువేరియా(తండ్రి మొహమ్మద్ అబ్దుల్ అజీజ్) రాబోవు రోజుల్లో ఉన్నత చదువులు చదవాలని ప్రణాళిక చేసుకోవాలని తగు సూచనలు ఆవాజ్ కమిటీ అందజేసింది. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్, ఆవాజ్ జిల్లా కమిటీ సభ్యులు షేక్ రియాజ్, రవూఫ్, దస్తగిర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విస్తృత స్థాయిలో పోలీసుల తనిఖీలు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు విస్తృత స్థాయిలో వాహ నాల తనిఖీలు నిర్వహి స్తున్నారు. ఎస్‌పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు అడిషినల్ ఎస్‌పి సిహెచ్ సౌజన్య సూచనల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా ప్రతినిత్యం వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మీడియాతో పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రజల కోసం పోలీసులు ఉన్నారనే భద్రత భావాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు కషి చేస్తున్నామని, రాత్రి పూట దొంగతనాలు, అల్లర్లు, గొడవలు జరగకుండా శాఖ పరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసు తనిఖీలల్లో భాగంగా రాత్రి వేళలో అనవసరంగా తిరిగే వారిపై ప్రత్యేక దృష్టి ఉంచి వారి వేలిముద్రలు సేకరిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్రవాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవ్ లకు దూరంగా ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్ల వాహనాలు నడిపి రోడ్డు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. కావున తల్లిదండ్రులు వారిపై నిఘా ఉంచి మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. అతివేగం, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, ఓవర్‌లోడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, ఆటో సైడ్ సిట్టింగ్, డెఫెక్టీవ్ నంబర్ ప్లేట్స్, అనధికార పార్కింగ్ మొదలైన ఉల్లంఘనలకు జరిమానాలు విధిస్తున్నామన్నారు. ఎటువంటి పరిస్థితుల్లో జాతీయ రహదారులపై రాంగ్ రూట్ లలో ప్రయాణం చేయరాదన్నారు. గమ్యాలకు క్షేమంగా చేరాలని, ఇతరులకు, తమకు ప్రాణనష్టం జరగకుండా తమ ప్రాణాలను రక్షించుకోవాలని సూచించారు.

మాట్లాడుతున్న నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

రెండు చోట్ల రైల్వే అండర్ బ్రిడ్జిలు

ప్రజాశక్తి-నెల్లూరు

కొండాయపాలెం గేటు, భక్తవత్సలనగర్ ప్రాంతాలల్లోని రైల్వే గేటు సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ నందన్, ఆర్‌డిఒ, విద్యుత్ శాఖ, పబ్లిక్ హెల్త్ శాఖ, కార్పొరేషన్, రైల్వే శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులనుద్దేశించి రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ కొండాయపాలెం గేట్, బి.వి.నగర్ రైల్వే గేట్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు లేనందున ప్రజలు అనేక సంవత్సరాలుగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రజా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఎట్టకేలకు కొండాయపాలెం గేట్, బి.వి.నగర్ రైల్వే గేట్ ల వద్ద కేంద్ర రైల్వే శాఖ రైల్వే అండర్ బ్రిడ్జిలను మంజూరు చేసిందన్నారు. అధికారులందరినీ సమన్వయం చేసుకునే బాధ్యత తీసుకోని మే 10వ తేదీ లోపల వివిధ శాఖ అధికారుల సహకారాన్ని రైల్వే శాఖ అధికారులకు అందజేస్తామన్నారు. నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రోత్సాహంతో జూన్ నెలాఖరు లోపు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కొండాయపాలెం గేట్,బి.వి.నగర్ రైల్వే గేట్ల వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు కావడంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లాకు చెందిన రైల్వే, విద్యుత్తు, కార్పొరేషన్ పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను సిఎంకు తెలియజేయండి..

- గిరిజనులకు సూచించిన మంత్రి ఆనం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : గిరిజన కాలనీకి మే 1వ తేదీన స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్నారని, సమస్యలను తెలుసుకుని ఆయన పరిష్కరిస్తారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆత్మకూరులో సిఎం పర్యటన ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి విచ్చేయనున్న నెల్లూరుపాలెం గిరిజన కాలనీని మంత్రి సందర్శించారు. స్థానిక రామాలయంలో గిరిజనులతో మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు. ఎస్టేట్ తమ పిల్లలను చదివించాలని, యువతతో ప్రత్యేకంగా మాట్లాడి స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గిరిజనులు తమకు ఇళ్లు సరిగా లేవని, వర్షం వస్తే ఉరుస్తున్నాయని మంత్రికి తెలిపారు. 32 మందికి గృహాలు అవసరమని గుర్తించామని తెలపగా స్పందించిన మంత్రి ఇళ్ల లేని 32 మందికి స్వయంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇంటి నివేశ స్థలాలకు మంజూరు పత్రాలు అందించాలని హామీ ఇచ్చారు. ఇందుకు అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే రామాలయంలో ధూప దీప నైవేద్యాలకు రూ.10వేలు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు. గతంలో రూ.5వేలు ఇచ్చారని, ముఖ్యమంత్రి రూ.10 వేలకు పెంచారన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి ఈ కాలనీలో పర్యటించి ఒకటి, రెండు కుటుంబాలకు స్వయంగా వెళ్లి పింఛన్లు అందిస్తారని, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరపున భరోసా కల్పిస్తారన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

ప్రజాశక్తి-కావలి : ఉగ్రదాడిలో బలైన మధుసూదన్ కుటుంబానికి అండగా ఉంటామని, సహాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏపి ప్రభుత్వ ప్రత్యేక సలహాదారు జి.సతీష్ రెడ్డి తెలిపారు. ఉగ్రదాడిలో బలైన సోమిశెట్టి మధుసూదన్ కుటుంబాన్ని ఎంఎల్ఎ క్రిష్ణారెడ్డితో కలిసి శుక్రవారం పరామర్శించారు. మధుసూదన్ కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఎఎస్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఆదేశానుసారం వైద్య సిబ్బందితో శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ మంజులమ్మ, ఎం.పి.హెచ్.ఒ. చిన్నయ్య, పి.హెచ్.ఎన్. సులోచన, సూపర్‌వైజర్ రఫీక్, ఫిమేల్ సూపర్‌వైజర్ కుమారి, హెల్త్ అసిస్టెంట్ ఫణి రయాల్, ఎఎన్ఎంలు, ఎం.ఎల్.హెచ్.పి.లు, ఆశా వాలంటీర్లు పాల్గొన్నారు.

దుంపల కాలువ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-కోవూరు : కోవూరులోని ప్రధాన డ్రెయిన్ దుంపల కాలువను ఆధునీకరించేందుకు సర్వే బృందం మార్కింగ్ చేసే కార్యక్రమాన్ని ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల ఈ దుంపల కాలువను కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా పరిశీలించి ఇరిగేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల సర్వేయర్ రమేష్ గౌడ్, గ్రామ రెవెన్యూ అధికారి శ్రీనివాసులురెడ్డి, గ్రామ సర్వేయర్ రోవర్ ద్వారా కాలువ సర్వే కార్యక్రమాన్ని ఎట్టకేలకు ప్రారంభించారు. దాంతో ఈ దుంపల కాలువను ఆక్రమించుకుని ఉన్న ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. మొత్తం మీద ఈ సర్వే ఈ ప్రాంత వాసులకు తీపి కబురు కలుగజేసింది.

పంచాయతీ ఆస్తులను గుర్తించాలి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పంచాయతీలకు సంబంధించిన ప్రభుత్వ ఆస్తులను పక్కాగా గుర్తించి ఆ నివేదికను యుద్ధప్రాతిపదికన సమగ్రంగా అందజేయాలని ఎంపిడిఒ శ్రీహరిరెడ్డి తెలిపారు. కోవూరులోని ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సమీక్షలో ఇఒపిఆర్డి శ్రీనివాసులు, మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-విడవలూరు : రైతులు మట్టి పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి వెంకట కృష్ణయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని రామతీర్థం, రామచంద్రాపురం గ్రామాలలో రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలాల్లోని మట్టిని పరీక్షించి మట్టికి తగ్గట్టుగా ఎరువులను వాడుకోవాలని సారవంతమైన మట్టితో అధిక దిగుబడి పంటలను పండించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : రైతులు తమ పొలాల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని తద్వారా ఎరువుల వినియోగించడం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ముసునూరు సురేష్ బాబు సూచించారు. కలిగిరి మండలం వెలగపాడు, పెద్దకొండూరు రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం మట్టి నమూనాల సేకరణ, వరి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో విఎఎ వెంకటేశ్వర్లు, విహెచ్ఎ అనూష, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో దిగుబడులు

ప్రజాశక్తి-కోవూరు : రైతులు ప్రకృతి వ్యవసాయం దిగుబడులు పెంచేందుకు కృషి చేయాలని ఎడి సుజాత కోరారు. మండలంలోని పోతిరెడ్డిపాలెం గ్రామంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా శుక్రవారం రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయిల్ బాగానూ రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎఒ ఇందిరావతి, ఉమామహేశ్వర, దాసరి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

టిపి గూడూరు విద్యార్థుల సత్తా..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలంపిక్స్ క్రీడల్లో టిపి గూడూరు విద్యార్థులు సత్తా చాటారు. ఈ క్రీడల్లో క్రీడాకారులు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు జరిగిన స్పెషల్ ఒలంపిక్ భారత్ 2025 -26 పోటీలలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. భారత్ ఆధ్వర్యంలో స్పెషల్ ఒలంపిక్ నూజివీడు, ఆగిరిపల్లిలో గల టీక్ పాఠశాల స్కూల్ లో ఈనెల 21 నుంచి 23 వరకు పిల్లలకు జరిగాయి. ఈ పోటీలలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో 8వ తరగతి చదువుతున్న ఎస్. శరత్ కుమార్ అత్యంత ప్రతిభను ప్రదర్శించి లోయర్ ఎబిలిటీ 100 మీటర్ల పరుగు పందెం లో రాష్ట్రస్థాయిలో సిల్వర్ మెడల్ సాధించారు. ఈ మేరకు రాష్ట్ర సమగ్ర శిక్ష ఎపిసి పిడి రవీందర్ రెడ్డి శరత్ కుమార్ సిల్వర్ మెడల్ అందుకున్నారు. అదే పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న వి. మోహన్ శివరాం బ్రాంజ్ మెడలను కైవసం చేసుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి జయరామరాజు ఐఎఎస్ చేతుల మీదుగా బ్రాంజ్ మెడల్ ని అందుకున్నారు. రాష్ట్ర స్థాయి స్పెషల్ ఒలింపిక్స్ లో సత్తా చాటిన క్రీడా కుసుమాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు రియాజ్ అహ్మద్, ఉపాధ్యాయులు రామచంద్రయ్య, ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి భారతదేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించి మండలానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చిన విద్యార్థులపై మండల ప్రజలు ప్రశంసల జల్లు కురిపించారు.

ప్రీ స్కూల్ కార్యక్రమాలను పారదర్శకంగా చేపట్టాలి

ప్రజాశక్తి-కోవూరు : పూర్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విద్యా బుద్ధులు అందిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు ఆటపాటలతో కూడిన విద్యను పారదర్శకంగా అందించాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్. సుధ్ర చెప్పారు. కోవూరు పంచాయతీ పరిధిలోని పెళ్లకూరు కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి వాటిని ఆదర్శంగా తీర్చిదిద్దేలా కార్యకర్తలు దృష్టి పెట్టాలన్నారు. ఆమెవెంట సిడిపిఒ జ్యోతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధిక, అంగన్వాడీలున్నారు.

సీనియర్ సివిల్ జడ్జికి సత్కారం

ప్రజాశక్తి-కావలి : అనంతపురం జిల్లా ధర్మవరం సీనియర్ సివిల్ జడ్జిగా విధులను నిర్వర్తించి ట్రాన్స్‌ఫర్ మీద కావలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.గీత వాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కావలి బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాటా సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జనరల్ సెక్రెటరీ మిద్దెల జయప్రకాష్, సీనియర్ న్యాయవాదులు కలికి శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ అభిషేక్, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి దుస్సాలువతో సత్కరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించరూ..

ప్రజాశక్తి-గుడ్లూరురూరల్ : మండలంలోని మొగులూరు గ్రామంలో తాగునీటి సమస్య పది నెలల నుండి అందక ఇబ్బందులు పడుతున్నారని గ్రామ ప్రజలు వాపోతున్నారు. మొగులూరు గ్రామానికి నీరందించే నీళ్ల బోర్ మోటారు చెడిపోయి సుమారు 10 నెలలు అవుతున్నా స్థానిక సర్పంచ్ గాని సచివాలయ సిబ్బంది పట్టించుకోలేదన్నారు. ఎన్నోమార్లు విషయం వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఈ మోటార్ ద్వారా గ్రామ మొత్తం నీరు అందుతూ ఉండేది. ఇది కాస్త మరమ్మతులకు గురవడంతో తాగునీటి అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. రాత్రింబవళ్ళు నీళ్ళ కూడా అంతంత మాత్రమే వస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామప్రజలు కోరుతున్నారు.

విద్యా వ్యవస్థ మెరుగుపడాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

రాష్ట్రంలో విద్యావ్యవస్థ మెరుగుపడి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. శుక్రవారం మండలంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు శిక్షణ తరగతులలో ప్రసంగించేందుకు ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులు, మాజీ ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రమణ్యం విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రస్తుతం విద్యలో శాస్త్రీయత ఉండట్లేదని అదేవిధంగా గత 11 సంవత్సరాలు నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తన మతోన్మాద విధానాలను సమాజంలో, పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు కల్పితమైన పాఠ్యాంశాలను బోధించే విధానాలు తీసుకొస్తుందన్నారు. పాఠ్యాంశాల్లో స్వాతంత్ర్య సమరయోధులు వంటి జీవిత చరిత్రలను తొలగిస్తున్నారన్నారు. దానిని పూర్తిగా వ్యతిరేకించాల్సిన పరిస్థితి ఈరోజు ప్రతిఒక్క విద్యార్థి పైన బాధ్యత ఉందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్రాలలో నూతనంగా ఏర్పాటు అయినా కూటమి ప్రభుత్వం విద్యార్థుల హక్కులను కాలరాసే ప్రయత్నాలు చేస్తున్నాయని, విద్యా విధానాల్లో అనేక మార్పులు తీసుకొస్తున్న ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు అనేక సమస్యలు విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలుచేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. స్వాతంత్రం వచ్చి 77సంవత్సరాలు గడుస్తున్న విద్య వైద్యం పూర్తిగా ప్రయివేటు, కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లో ఉండిపోయిందన్నారు. విద్యార్థుల సమస్యలపై, విద్యార్థుల హక్కులు కాపాడేందుకు ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి టి.వి.వి ప్రసాద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెన్ను నరేంద్ర, సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు విక్రమ్, దేవేంద్ర, నాని, వర్ధన్, విగ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

బుకింగ్ ఆఫీస్ పున:ప్రారంభం

ప్రజాశక్తి-బిట్రగుంట

బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో బుకింగ్ ఆఫీసును పూన:ప్రారంభిస్తూ రైల్వే అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే అభివద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ మాట్లాడుతూ బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ, బోగోలు మండల సిపిఎం నాయకులు తుమ్మల వెంకయ్య, చల్ల నరహరి, పొట్లూరి శ్రీనివాసులు, సిపిఎం నాయకులు, బిజెపి జిల్లా నాయకులు నూకసాని శ్రీనివాసులు, గ్రామస్తులు, వ్యాపారస్తులు, రైల్వే విశ్రాంతి ఉద్యోగస్తులు కలసి చేసిన పోరాటాలు, రైల్వే ఉన్నత అధికారులకు రాసిన లేఖల ద్వారా, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక చొరవ వల్ల ఎట్టకేలకు బిట్రగుంటలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్, బుకింగ్ ఆఫీసును రైల్వే అధికారులు శనివారం నుండి అధికారికంగా ప్రారంభించనున్నారు. నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావుకు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ నూరుద్దీన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో బట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ సభ్యులు జహీర్, అహ్మద్ భాషా, రఫీ, భక్తుల రవి, దాసరి సునీల్, డబ్బేరు శ్రీధర్, ఇర్మియ, లోకేష్, ఇమ్మిడిశెట్టి కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

కమిషనర్ నందన్‌ను కలిసిన జెవివి నాయకులు

ప్రజాశక్తి - ఉదయగిరి

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పూర్తి స్థాయిలో బాధ్యతలు తీసుకున్న వై ఒ నందన్‌ను సన్నిహిత మిత్రులైన జిల్లా జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు గాజులపల్లి రామిరెడ్డి ఉదయగిరి జిల్లా సాధన కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ దస్తగిరి అహ్మద్ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గౌస్ బాషా ఆయనను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు ఆయన ఛాంబర్‌లో మర్యాదపూరకంగా కలిసి పలు విషయాలను ప్రస్తావిస్తూ వారి స్వగ్రామమైన ప్రకాశం జిల్లా పామూరు మండలం గ్రామ ఇన్నిమెర్ల గ్రామ అభివృద్ధి గురించి చర్చించారు.

సమస్యలను తెలుసుకుంటున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

ప్రజా విజ్ఞప్తులు స్వీకరణ

ప్రజాశక్తి-వింజమూరు

వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో ప్రజా విజ్ఞప్తుల దినం సందర్భంగా ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం ఎంఎల్ఎలు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వాటిని పరిష్కరించాలని ఆదేశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం ఎంఎల్ఎ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖ అధికారులకు పంపించారు. వాటిని పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యంగా దుత్తలూరు మండలం వింజమూరు కలిగిరి వరికుంటపాడు మండలాలకు సంబంధించిన అర్జీలు అధికంగా వచ్చాయి. కార్యక్రమంలో 8 మండలాల నాయకులు అర్జీదారులు తదితరులు ఉన్నారు.

రూ.లక్ష ఆర్థికసాయం

ప్రజాశక్తి-విడవలూరు

మండల పరిధిలోని చౌకచర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన చర్చికి కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని శుక్రవారం టిడిపి మండల ఇన్‌ఛార్జ్ అడపాల శ్రీధర్ రెడ్డి ద్వారా అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, టిడిపి నాయకులు, చర్చి పాస్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి -ఆత్మకూరు అర్బన్

1వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆత్మకూరు పర్యటన సందర్భంగా అధికారులతో కలిసి శుక్రవారం ముందస్తుగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఏర్పాట్లు పరిశీలించారు. ఆత్మకూరు బిసి బాలికల గురుకుల పాఠశాల వద్ద హెలీప్యాడ్, నారంపేట ఎంఎస్ఎంఇ పార్క్ వద్ద హెలిప్యాడ్ స్థలాలను, కార్యక్రమ ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. నారంపేట వద్ద పైలాన్ ఆవిష్కరణ ఏర్పాట్లపై ఏపీఐఐసీ అధికారులతో మంత్రి చర్చించారు. అనంతరం ముఖ్యమంత్రి పింఛన్లు పంపిణీ చేసే నెల్లూరు పాలెం గిరిజన కాలనీలో మంత్రి పర్యటించారు. స్థానిక రామాలయంలో గిరిజన ప్రజలు, యువతతో మంత్రి మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజావేదిక ఏర్పాటు కోసం ఆత్మకూరు ఎఎంసి గ్రౌండ్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఆత్మకూరు మెట్టప్రాంత యువత ఉజ్వల భవిష్యత్తు కోసం నారంపేట వద్ద ఎంఎస్ఎంఇ పార్కును ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని మంత్రి తెలిపారు. పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 50 ఎంఎస్ఎంఇ పార్కులను ఆత్మకూరు నుంచి సిఎం ప్రారంభించినట్లు తెలిపారు. నారంపేట ఎంఎస్ఎంఇ పార్క్ వద్ద విద్యుత్, రోడ్లు, తాగునీరు మొదలైన మౌలిక వసతులు కల్పించి పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టేందుకే ముఖ్యమంత్రి ఆత్మకూరులో పర్యటిస్తున్నారన్నారు. ఆత్మకూరులోని గిరిజన కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్వయంగా ఒకటి, రెండు గిరిజనుల నివాసాలకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారని, ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తరపున సిఎం భరోసా కల్పించనున్నారన్నారు. మే 1న మేడే కార్మిక దినోత్సవం పురస్కరించుకొని కార్మికులతో సిఎం ప్రత్యేకంగా సమావేశమై వారికి శుభాకాంక్షలు తెలుపనున్నారని, కార్మికులతో మమేకమై వారి సమస్యలను ముఖ్యమంత్రి తెలుసుకుంటారన్నారు. ఆత్మకూరు ఎఎంసి గ్రౌండ్లో నిర్వహించే ప్రజా వేదిక కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటికి ముఖ్యమంత్రి పరిష్కారం చూపనున్నారని తెలిపారు. టిడిపి కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతంపై ఒక గంటపాటు సుమారు 300 నుంచి 400 మంది కార్యకర్తల సలహాలు సూచనలు తీసుకుంటారని, ముఖ్యమంత్రి సలహాల మేరకు తెలుగుదేశం పార్టీకి ఆత్మకూరును కంచుకోటగా నిలిపేందుకు కృషి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. సిఎం కార్యక్రమం పూర్తి వివరాలు త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రకటిస్తామన్నారు. ఆర్‌డిఒ పావని, ఎపిఐఐసి జడ్ ఎం.శివకుమార్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, డిఎస్‌పి వేణుగోపాల్, ఎంపిపి వేణుగోపాల్ రెడ్డి, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్సిడీతో వేపనూనె పంపిణీ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో మండలంలోని రైతులకు ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.దేవసేనమ్మ, మండల వ్యవసాయ అధికారిని టి రజనీ ఆధ్వర్యంలో రబీ సీజన్ సంబంధించి ఎఫ్ఎన్ఎస్‌పియు ఎల్ఎస్‌జిఎస్ ఆహార పోషక పథకం – అపరాలు కింద 50శాతం సబ్సిడీతో వేపనూనె 1500 పిపిఎంను, ఎన్ఎంఇఒఎస్ జాతీయ ఆహార నూనె గింజల ఉత్పత్తి మిషన్ కింద జిప్సం సబ్సిడీతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఇఒలు, విఎఎలు, విహెచ్ఎలు రైతులు పాల్గొన్నారు.

ఉచితంగా ఖత్నాలు

ప్రజాశక్తి బిట్రగుంట

బిఎంఆర్ చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు సహకారంతో సోమవారం ముస్లిం పేద పిల్లలకు ఉచిత వడుగుల శిబిరాన్ని బోగోలు మండలం ఇబ్రహీంపేట సెంటర్లో ఉన్న ఎం.కె.ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు బిఎంఆర్ యువసేన అధ్యక్షుడు సమీవుల్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని బోగోలు, దగదర్తి, అల్లూరు, కావలి రూరల్ మండల పేద ముస్లిం పిల్లలు అందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

డాక్టర్ ప్రణీత్ సహకారం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని 13వ వార్డుకు చెందిన తేజేష్ అనే అబ్బాయికి చిన్ననాటి నుంచి మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో స్పందించిన ఆత్మకూరు వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్టు అధినేత, ఎస్‌వి ప్రజావైద్యశాల మేనేజింగ్ డైరెక్టర్, వైసిపి జిల్లా డాక్టర్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ ప్రణీత్ తనవంతు సహకారం అందించారు. శుక్రవారం ఆసుపత్రిలో తేజేష్‌కు ఒక సంవత్సరానికి సరిపడా మందులను అందచేసి ఆదుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ సీజర్ సింద్రోమ్ విత్ ఇఎల్ బిఎస్ఎన్ సియోవోపతి అనే వ్యాధి కారణంగా మెదడు అభివృద్ధి నెమ్మదిగా జరగడం, మూర్ఛ రావడం వంటివి సంభవిస్తాయని, జీవితాంతం వీరు మందులపై ఆధారపడి బతకాల్సి వస్తుందన్నారు. దానికి శాశ్వత చికిత్స అంటూ లేదన్నారు. తేజేష్ ఆరోగ్య పరిస్థితిని ఆత్మకూరు నరేష్ తమ దష్టికి తీసుకురావడంతో తమ ట్రస్టు తరపున ఒక సంవత్సరానికి సరిపడా మందులను అందజేసినట్లు, భవిష్యత్తులో కూడా తమవంతు సహయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఆయనవెంట ట్రస్టు సభ్యులు డాక్టర్ కుమార్, తోడేటి అశోక్ తదితరులు ఉన్నారు.

డాక్టర్ వెంకటరమణయ్యపై క్రమశిక్షణ చర్యలకు సిఫార్సు

ప్రజాశక్తి -నెల్లూరు : కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం పనితీరుపై అవినీతి, అక్రమాలు, వ్యాపారులను వేధించడం వంటి చర్యలకు డాక్టర్ వెంకటరమణయ్య పాల్పడ్డారని ఫిర్యాదులపై ఎసిబి విచారణలో నిర్ధారణ కావడంతో క్రమశిక్షణా చర్యలను చేపట్టేందుకు ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ నగర పాలన పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖను కోరారు. నిర్లక్ష్యంతో నెల్లూరు మునిసిపాలిటీ ఆదాయానికి గండి నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్లో ఆరోగ్యాధికారిగా ఉంటున్న డాక్టర్ పి.వెంకట రమణయ్య కార్పొరేషన్ కు రావాల్సిన దాదాపు రూ.12 కోట్ల ఆదాయం వసూలు విషయంలో నిర్లక్ష్యం వహించారని, ఇందుకు సంబంధించిన అధికారుల పనితీరును పర్యవేక్షించ డంలో విఫలమయ్యారని వైద్య ఆరోగ్య శాఖకు ఎసిబి నివేదిక అందజేసింది. కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం పనితీరుపై అవినీతి, అక్రమాలు, వ్యాపారులను వేధించడం వంటి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎసిబి విచారణ చేపట్టింది. నగరంలోని 44 ఆసుపత్రులు అనుమతులు లేకుండా పని చేస్తున్న ఆరోగ్యాధికారి పట్టించుకోలేదని, 27 ఫంక్షన్ హాళ్లను తనిఖీ చేయలేదని కూడా ఆరోపణలొచ్చాయి. వీటిపై ఎసిబి ఏప్రిల్ 2022 లో ఆకస్మిక తనిఖీ జరిపి విచారణ చేపట్టింది. డాక్టర్ వెంకటరమణయ్య ఆరోగ్యశాఖ అధికారి కనుక అతనిపై తగు క్రమశిక్షణా చర్యల్ని చేపట్టేందుకు పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖకు ఆమోదాన్ని తెలిపారు.

ఎల్ఐసి చెక్కు అందజేత

ప్రజాశక్తి-కావలి

జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో అసువులు బాసిన సోమిశెట్టి మధుసూదన్ "జీవన్ శ్రీ" పాలసీ (భారతీయ జీవిత భీమా సంస్థ, కావలి బ్రాంచ్) డెత్ క్లెయిమ్ మొత్తం రూ.10,74,920 ఎల్.ఐ.సి. నెల్లూరు డివిజన్ మార్కెటింగ్ మేనేజర్ కె.రామకృష్ణయ్య శుక్రవారం వారి ఇంటివద్ద నామినీ అయిన వారి తండ్రి సోమిశెట్టి తిరుపాలుకి అందజేశారు. డెత్ సర్టిఫికెట్ వగైరాలు లేకుండా కేవలం న్యూస్ ఛానల్, న్యూస్ పేపర్స్ ఆధారంగా క్లెయిమ్ సెటిల్ చేయబడిందన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి నెల్లూరు డివిజన్ అధికారులు జి.ప్రసాదరావు, ఎస్.ఫయాజ్ అహ్మద్, ఎల్ఐసి కావలి శాఖ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎ.బాలాజీ బాబు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ డి.భాస్కర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక చొరవ తీసుకోవాలి

ప్రజాశక్తి-కోవూరు : ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు వారివారి పరిధిలో టీబీ అనుమానితులను గుర్తించి వారికి ప్రత్యేక పరీక్షలను చేయించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని నెల్లూరు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ ఎస్కే ఖాదర్వలి తెలిపారు. కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఉగ్రదాడి ఘటనపై పలుచోట్ల నిరసన ర్యాలీ

ఉదయగిరిలో..

ప్రజాశక్తి-ఉదయగిరి : జమ్ము కాశ్మీర్ పహల్గాం పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శాంతి ర్యాలిని నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి గ్రామపంచాయతీ బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి కుల మతాలకు అతీతంగా ఖండించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాకు వెంకటయ్య, టిడిపి రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు షేక్ రియాజ్, జిల్లా సాధన కమిటీ నాయకులు దస్తగిరి అహ్మద్, గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ షేక్ ముర్తుజ హుస్సేన్, వైసిపి మండల కన్వీనర్ ఓబుల్ రెడ్డి, ఎంఆర్‌పిఎస్ నాయకులు జాషువా, బాల గురవయ్య, గడియాల్చి ఎస్దాని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కాశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆత్మకూరు నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాల మేరకు ఆత్మకూరు వైసిపి నాయకులు నిరసన ప్రదర్శన, ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మ శాంతికి కొవ్వొత్తులతో నివాళి కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ ఉగ్రవాదం నశించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా సాగారు. బిఎస్ఆర్ సెంటర్‌కు చేరుకుని అనంతరం అక్కడ మానవ హారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, పట్టణ కన్వీనర్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, పులిమి వెంకట రమేష్ రెడ్డి, అనంతసాగరం మండల కన్వీనర్ బిజివేముల పిచ్చిరెడ్డి, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు నందా ఓబులేసు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండా వెంకటేశ్వర్లు, నియోజకవర్గ మున్సిపల్ విభాగ కన్వీనర్ కామాక్షయ్యనాయుడు, నోటి వినయ్ కుమార్ రెడ్డి, షేక్ పర్వీన్, కల్పనారెడ్డి, ఆంఢ్రా సుబ్బారెడ్డి, ముతీవర్, యువత నాయకులు నాగా సుబ్రహ్మణ్యం రెడ్డి, కోదండ రామిరెడ్డి, నాగిరెడ్డి, మహ్మద్ రఫీ, బాల అంకయ్య, తోడేటి అశోక్, బొడ్డు గిరి, కలాం, రిజ్వాన్, ముతీవర్, భాస్కర్, సురేష్ యాదవ్, శ్రీను, విష్ణు, వెంకటేశ్వర్లు, జమ్రు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : కాశ్మీర్లోని పహల్గాంలో ఉగ్రవాద మూకలు అమాయక పర్యాటకాలపై జరిపిన దారుణ మారణకాండకు నిరసనగా, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మూడు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా సంతాప దినాలుగా ప్రకటించడమే కాకుండా, జనసేన పార్టీ తరపున రాష్ట్ర వ్యాప్తంగా ఈ మూడు రోజులు నిరసన కార్యక్రమాలు చేశారు. ఇందులో భాగంగా ఈరోజు మూడో రోజు ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ దగ్గర అంబేద్కర్ బొమ్మ ముందు గత మూడు రోజులుగా ఏర్పాటు చేసిన టెంట్‌లో నిరసన కార్యక్రమం జరిపి తదనంతరం మున్సిపల్ బస్టాండ్ నుండి స్థానిక బిఎస్ఆర్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి బి.ఎస్.ఆర్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి జనసేన పార్టీ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో అన్ని నియోజకవర్గాల నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కావలి : ఉగ్రవాద దాడిలో బలైన సోమిశెట్టి మధుసూదనరావు మృతికి కావలి ఎం.ఎల్.ఏ. దగ్గుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తులర్యాలీ నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజానీకం భారీ ఎత్తున హాజర య్యారు. బ్రిడ్జి సెంటర్ నుంచి కావలి ఐకానిక్ పాయింట్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన కొనసాగింది.

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్ : కాశ్మీర్‌లో జరిపిన కాల్పుల్లో మృతుల కుటుంబాలకు మండల కేంద్రంలోని యువకులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి శ్రీ పొట్టి శ్రీరాములు బస్టాండ్ సెంటర్ వరకు గ్రామస్తులు, కొందరు యువకులు కలిసి దాడులను తీవ్రంగా ఖండిస్తూ టూరిస్టులపై హిందువులపై భారత దేశంలో జరిగిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాద దాడులకు నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తూ చనిపోయిన బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా న్యాయం జరగాలని కోరారు. ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండించారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : మతాల పేరుతో జరుగుతున్న మారణ హోమాలను ఆపాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు లేల్లపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజెపి నరేంద్ర మోడీ పరిపాలనలో దేశంలో ఉగ్రవాదం పెట్రేగి పోతుందని, అమాయకులతో పాటు అనేక మంది బలవుతున్నారు. ఈ దాడిలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారని తెలిపారు. భారతీయుల్లో భయానక పరిస్థితిని నెలకొల్పిందని, కాశ్మీర్‌లో కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా ఒక వర్గం వారితో పాటు స్థానికులు పలువురు తీవ్ర అసంతృప్తితో, ఆగ్రహంతో ఉన్నారని, బిజెపి పాలన పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, దాంతో ఒక వర్గం వారు ఉగ్రవాదంకు ఊతమిస్తుందన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : కాశ్మీర్‌లోని పెహల్గాంలో ఉగ్రవాదులు అమాయక పర్యాటకులపై జరిపిన దాడిని పిరికిపంద చర్యగా భావిస్తూ మండల కేంద్రమైన కలిగిరిలోని కూటమి నాయకులు ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన కుటుంబాలకు నల్ల బ్యాడ్జీలు ధరించి ఘనంగా నివాళులు అర్పించారు. జనసేన పిఏసి కొట్టే వెంకటేశ్వర్లు, బండారు లక్ష్మీనారాయణ, భుజం కృష్ణారెడ్డి, కదిరి రంగారావు, దుంపలగడ్డ రవి, బండారు మల్లికార్జున, జనసేన అన్ని మండలాల అధ్యక్షులు వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కొండపల్లి వెంకట్రావు, కొండలరావు, కోసూరి సురేష్, సునీల్, కృష్ణ, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-దుత్తలూరు దుత్తలూరు మండలం హైస్కూల్, నందిపాడు కస్తూర్బా గాంధీ కళాశాల, నర్రవాడ వెంగమాంబ హైస్కూల్ ఎపి మోడల్ స్కూల్, కాలేజీ లో చదువుకుంటున్న విద్యార్థులకు వారి తల్లి దండ్రులకు దుత్తలూరు ఎస్ఐ పి.ఆదిలక్ష్మి శుక్రవారం పలు సలహాలు, సూచనలు మీడియా సమావేశం ద్వారా తెలియజేశారు. 24వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు వేసవి సెలవులను ప్రకటించడం జరిగిందని, ఈ సెలవు రోజుల్లో పిల్లలకు తల్లిదండ్రులు ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకొని, పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు.. ఎక్కడ తిరుగుతున్నారు.. ఏం చేస్తున్నారో.. స్నేహితులతో కలిసి చెరువులు, వాగులు, వంకలు దగ్గరికి ఈత కోసం వెళ్లనివ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్

గుడ్లూరు గ్రామంలో శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మంచి మార్కులు సాధించారు. ఫ్లెక్సీ ఫ్రేమ్. 582 మార్కులను సాధించి మండలం ఫస్ట్ గా శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ కొత్త రికార్డు సృష్టించింది. సాధారణ గ్రామీణ స్థాయి విద్యార్థులు కృషి, పట్టుదల సాధనతో నిరంతర శ్రమతో అసాధారణ ఫలితాలను సాధించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు అభినందనలు తెలియజేసింది.

డాక్యుమెంటు పోయినవి

మారంరెడ్డి సతీష్‌రెడ్డి, తండ్రి **మారంరెడ్డి లక్ష్మీనారాయణరెడ్డి**, టెక్కేమిట్ట, నెల్లూరు. నేను నెల్లూరు నుండి పడుగుపాడుకు వెళ్తున్న సమయంలో **885/2008** రిజిస్ట్రార్ **డాక్యుమెంటు** తేది **12.04.2025** న దారిలో పడిపోయినవి. అవి ఎవరికైనా దొరికన యెడల ఈ క్రింది నెంబర్‌లకు తెలియజేయగలరు.

సెల్ : **98495 28669, 94946 41633**